# రైస్ మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్

- ధాన్యం బస్తాల దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13(ప్రజా శంఖారావం):**

జిల్లా కేంద్రానికి సమీపంలో గల ఖానాపూర్ లోని రైస్ మిల్లులను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లక్ష్మీ బాలాజీ రైస్ మిల్లును, శ్రీ సిద్ధి రామేశ్వర ప్రైవేటు లిమిటెడ్ మిల్లులను సందర్శించారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని వివరాలు సేకరించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు



పలికారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, రైస్ మిల్లుల నిర్వాహకులు వి. మోహన్ రెడ్డి, శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మే 13 (ప్రజా శంఖారావం):**

జిల్లాలోని రామారెడ్డి మండలం గిద్ద–2 గ్రామంలోని ధాన్యం పాడి కేంద్రం, సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శించి పరిశీలించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు నిర్వహించాలని, కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు, తేమ శాతాన్ని



పరిశీలించి నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు. కొనుగోలు అనంతరం లిఫ్టింగ్, రవాణా ప్రక్రియల్లో జాప్యం లేకుండా చూడాలని, లారీలు, హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే 5 వేల క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించగా, మిగిలిన స్టాక్‌ను 10 రోజుల్లో పూర్తి స్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ సురేందర్, డీఎం శ్రీకాంత్, సహకార అధికారి రామ్మోహన్, డీఎం మార్క్‌ఫెడ్ అధికారులు, ప్రత్యేక అధికారులు, ఎంఈఓ, ఏఓ తదితరులు పాల్గొన్నారు.

## పోచారంలో గడ్డి వాముకు నిప్పు



**ఎడపల్లి, మే 13 (ప్రజాశంఖారావం):**

ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు గడ్డి వాముకు నిప్పంటించిన ఘటన కలకలం రేపింది. గ్రామ మాజీ సర్పంచ్ అశోక్‌సింగ్‌కు చెందిన గడ్డి వాము మంగళవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే స్పందించి స్వయంగా అగ్నిని అదుపు చేసే ప్రయత్నాలు చేపట్టారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. గడ్డి వాముకు సమీపంలో నివాస గృహాలు, వాహనాలు ఉండటంతో పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## కలెక్టర్ ను కలిసిన డీఆర్ఓ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13 (ప్రజాశంఖారావం):**

నిజామాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా బీ గీత బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

## నీట్ రద్దు ఘటన కేంద్ర వైఫల్యమే

**కామారెడ్డి/బీబీపేట్, మే 13 (ప్రజా శంఖారావం):**



కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే నీట్ 2026 పరీక్ష రద్దు ఘటనకు దారి తీసిందని అందుకు కేంద్రమే బాధ్యత వహించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ కావడంతో పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సి రావడం కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వైఫల్యమని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది పేపర్ లీకులు, అక్రమాల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పరీక్షను మళ్లీ నిర్వహించడంతో కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అకాడమిక్ సంవత్సరం దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ నిర్వహణలో ఎన్‌టీఏ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని విమర్శించిన నాగరాజ్ గౌడ్, ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# 25న ఆర్యవైశ్య టాపర్లకు సన్మానం




**కామారెడ్డి, మే 13 (ప్రజా శంఖారావం):**

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) కామారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో 2026 పదో తరగతి ఫలితాల్లో 550 మరియు అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త, ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, హైదరాబాద్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ హాజరుకానున్నారు. 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 18లోపు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బాలు 9492874006 కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి, ఎర్రం విజయ్ కుమార్‌లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లంకి సుదర్శన్, మందుల రామచంద్రం పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

**నిజామాబాద్ రూరల్ సిరికొండ,మే 13 (ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో రాజేంద్రకుమార్ బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ఎస్ఐఆర్, ఫారం–7 దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ ఇంటింటి పరిశీలనలు చేపట్టి అర్హుల పేర్లు నమోదు చేయడంతో పాటు తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఫారం–7 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పెద్దవాల్గోట్, హుస్సేన్‌నగర్, గడుకోల్ గ్రామాల వద్ద కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రాలకు



ఎన్ని లారీలు వచ్చాయి, ఇంకా ఎన్ని అవసరమున్నాయో వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే అదనపు లారీలు పంపించాలని ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం నిల్వ ఉండకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ధాన్యం తరలింపునకు లారీల సంఖ్య పెంచాలి

- కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వేముల ప్రశాంత్‌రెడ్డి

**బాల్కొండ/భీంగల్, మే 13 (ప్రజాశంఖారావం):**

కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. కోనసముందర్ కేంద్రంలో ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయని, ప్రస్తుతం వస్తున్న రెండు లారీలు సరిపోవడం లేదని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా ఉండాలంటే లారీల సంఖ్యను పెంచి, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ఎనిమిది రోజుల్లోగా



సేకరణ పూర్తి చేయాలని సూచించారు. నిజామాబాద్‌లోని భువనేశ్వర్ రైస్‌మిల్లు వారు క్వింటాల్‌కు 43 కిలోల చొప్పున ధాన్యం కోరుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 41.5 కిలోల చొప్పున మాత్రమే ధాన్యం సేకరించాలని స్పష్టం చేశారు. రైతుల కష్టాన్ని మిల్లర్ల పాలు చేయొద్దని అధికారులను హెచ్చరించారు. బషీరాబాద్ కేంద్రంలో ఇప్పటివరకు కేవలం 20 శాతం ధాన్యం మాత్రమే లిఫ్ట్ అయిందని, మిగిలిన ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ కూడా లారీల రాకను పెంచాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. ధాన్యం రవాణాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మట్టి లేదా పెండ తరలించే వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులకు సూచించారు. ట్రాన్స్‌పోర్టర్ల నిర్లక్ష్యంపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. రైతులు పండించిన ప్రతి గింజను తరుగు లేకుండా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని, వర్షాల ముప్పు దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం తరలింపు చేపట్టాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే



**జుక్కల్, మే 13 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం లోని పలు మండలం లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పలు శుభ కార్యక్రమంలో బుదువారం పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామం లో వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మద్నూర్ మండల బిఆర్ స్ సీనియర్ నాయకులు పండిత్ రావ్ పటేల్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుభకార్యాలలో ఆదిత్య స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే ని ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో మండలంలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ



**భీంగల్, మే 13 (ప్రజా శంఖారావం):**

భీంగల్ మండలం జాగిర్యాల్ గ్రామానికి చెందిన ఈనాడు రిపోర్టర్ అప్పాల శ్రీనివాస్ తల్లి రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలీసెట్-2026 ప్రవేశ పరీక్ష

**కామారెడ్డి, మే 13 (ప్రజా శంఖారావం) :**

కామారెడ్డి పట్టణంలో బుధవారం నిర్వహించిన పాలీసెట్–2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. సెట్ జిల్లా సమన్వయకర్త, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయకుమార్ వివరాలు వెల్లడిస్తూ పట్టణంలోని మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 2,643 మంది విద్యార్థులకు గాను 2,502 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో 1,117 మంది బాలురు, 1,385 మంది బాలికలు ఉన్నారని, మొత్తం హాజరు శాతం 95 గా నమోదైందన్నారు. పరీక్షా కేంద్రాలను ప్రత్యేక పరిశీలకుడు ఆర్. మోహన్ కుమార్‌తో కలిసి డాక్టర్ కె. విజయకుమార్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించామని వారు తెలిపారు.

## నేటి నుంచి కౌలాస్ నాల ప్రాజెక్ట్ నీటి విడుదల

**జుక్కల్, మే 13 (ప్రజాశంఖారావం):**

జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాల ప్రాజెక్ట్ స్పిల్‌వే గేట్ల మరమ్మత్తు పనుల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి కౌలాస్ వాగులోకి నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఏఈ అశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు రోజుల పాటు స్పిల్‌వే గేట్ల ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మరో మూడు రోజుల పాటు నీటి విడుదలను 150 క్యూసెక్కులకు పెంచనున్నట్లు తెలిపారు. మరమ్మత్తు పనులకు అనుగుణంగా నీటి విడుదల కొనసాగుతుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 454.55 క్యూసెక్కుల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. నీటి విడుదల నేపథ్యంలో వరద కాలువ పరిసర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువుల కాపరులు తమ పశువులను కాలువలకు దూరంగా ఉంచాలని, మత్స్యకారులు కాలువలోకి దిగవద్దని సూచించారు. వేసవి కాలం నేపథ్యంలో ప్రజలు స్నానం లేదా ఈత కోసం వాగులోకి వెళ్లవద్దని, వాగు దాటే ప్రయత్నాలు చేయరాదని తెలిపారు.

